
సాక్షి
మహబూబాబాద్
ఆదివారం । 24 । ఆగస్టు । 2025



ప్రకృతి సోయగం.. భీమునిపాదం..
జిల్లాలోని గూడూరు మండల పరిధిలో దట్టమైన అడవిలోని భీముని పాదం జలపాతం ప్రకృతి ప్రేమికును ఆకర్షిస్తుంది.
- 8లో▸



ఏసీబీ వలలో డోర్నకల్ సీఐ, కానిస్టేబుల్
డోర్నకల్ సీఐ రాజేశ్ బెల్లం కేసులో నిందితుడి నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా శనివారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
35.6°/22.6°
వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



కేసముద్రం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కల్వల జెడ్పీ హైస్కూల్, పీఎస్‌లను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సబ్జెక్టులవారీగా విద్యాబోధన చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం వండే సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం డైనింగ్ హాల్, కిచెన్‌షెడ్లు, మరుగుదొడ్లు, తరగతి గదులను, స్టోర్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ క్రాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లినిక్‌ను వినియోగించుకోవాలి

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శాలిని



నెహ్రూసెంటర్: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శాలిని అన్నారు. జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను శనివారం ఆమె ప్రారంభించిన మాట్లాడారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్, గంజాయి, ఆల్కహాల్‌కు అలవాటు పడిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించి మంచిపౌరులుగా తీర్చిదిద్దడానికి క్లినిక్ ఉపయోగపడుతుందన్నారు. వ్యసనం ఒక తీవ్రమైన సమస్య అని పరిష్కారం కోసం డీ అడిక్షన్ సెంటర్ సాయం తీసుకోవడం ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ జగదీశ్వర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర సమితిలో నలుగురికి చోటు

● రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా విజయసారథి



విజయసారథి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

నెహ్రూసెంటర్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సమితిలోకి జిల్లా నుంచి నలుగురికి చోటు దక్కింది. పార్టీ రాష్ట్ర 4వ మహాసభలు మేడ్చల్ జిల్లా గాజులరామారంలో 3 రోజుల పాటు నిర్వహించి నూతన సమితిని ఎన్నుకోగా జిల్లాకుచోటు కల్పించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బి.విజయసారథి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా బి.అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయి న శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బి.విజయసారథి మాట్లాడుతూ... పార్టీ రాష్ట్ర బాధ్యతలతో బాధ్యత పెరిగిందన్నారు.

గర్భిణులకు అవగాహన కల్పించాలి

● డీఎంహెచ్ఓ రవిరాథోడ్



నెహ్రూసెంటర్: అంగన్‌వాడీలు హెచ్ఐవీ రహిత సమాజ ఏర్పాటులో కీలక పాత్ర పోషించాలని అందుకు గ్రామస్థాయి నుంచి క్షేత్రస్థాయిలో ప్రజలు, గర్భిణులకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ రవిరాథోడ్ అన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లకు శనివారం మహబూబాబాద్‌లో ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... గర్భస్థ శిశువుకు హెచ్ఐవీ సోకకుండా గర్భం దాల్చిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. గర్భిణులు అంగన్‌వాడీ సెంటర్లలో తప్పకుండా నమోదు చేసుకుని పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం ఎయిడ్స్‌పై అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు విజయ్ కుమార్, సారంగం, డెమో ప్రసాద్, ఎంపీహెచ్ఈఓ లోక్య, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జ్యోతి, సీఎస్‌ఓ సారయ్య, ఎస్ఎస్‌కే మేనేజర్ రమేష్, ఐసీటీసీ కౌన్సిలర్ రమేష్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగానే చిరునవ్వుతో ఆహ్వానించే ఓ రిసెప్షనిస్ట్. అక్రమార్కుల తాట తీసే ఓ టాస్క్‌ఫోర్స్ టీం మెంబర్. ఇలా శాఖలోని అన్ని విభాగాల్లో ముందుంటున్నారు మహిళా పోలీసులు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో అందరూ సమానమే అనేలా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇన్నాళ్లు కొన్ని విధులకే పరిమితమైన వారంతా ఉన్నతాధికారుల నిర్ణయాలతో రోడ్డెక్కి విధులు నిర్వహిస్తున్నారు. 'మీ భద్రతే మా బాధ్యత' అంటూ రాత్రిళ్లు సైతం విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులపై 'సాక్షి' సండే స్పెషల్ స్టోరీ. - వరంగల్ క్రైం



తగ్గేదేలే!

రాత్రిపూట మహిళా పోలీసుల పెట్రోలింగ్

● కూడళ్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో తనిఖీలు
● పురుషులతో సమానంగా విధులు
● వరంగల్ కమిషనరేట్‌లో తమదైన మార్క్

సండే స్పెషల్

డయల్ 100 కాల్స్ మొదలుకుని కష్టతరమైన ఫిర్యాదుల విచారణకు సైతం మహిళా పోలీసులు సై అంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పురుషులతో సమానంగా స్వీకరిస్తూ రంగంలోకి దిగుతున్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా బ్లూకోల్ట్ విధుల్లో పురుషులతో కలిసి సమర్థంగా రాణిస్తున్నారు. రాత్రిపూట పెట్రోలింగ్ విధుల్లో భాగస్వామ్యమవుతున్నారు. మహిళా నేరస్తులను జైళ్లకు తరలించే క్రమంలో ఎస్కార్ట్‌గా, నేతల సభలకు షార్ట్ వెపన్లతో హాజరై సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

కష్టతరమైనప్పటికీ విధులకు..

సాధారణంగా పోలీస్ స్టేషన్లలో రూల్‌కాల్ ఉదయం 9 గంటలకు చేపడుతున్నారు. అప్పటి నుంచి 2 గంటల వరకు విధులు నిర్వహించి.. ఆ తర్వాత సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు డ్యూటీలో కొనసాగుతున్నారు. రాత్రి డ్యూటీ ఉన్నవారు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. రిసెప్షన్ విధులు నిర్వహించే మహిళలు ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు డ్యూటీలో ఉంటే మధ్యాహ్నం 2 గంటల నుంచి 9 గంటల వరకు మరొకరు విధులు చేపడుతున్నారు. వీరికి 24 గంటల పాటు రెస్ట్ దొరుకుతుంది.

కమిషనరేట్‌లో మహిళా అధికారులు ఇలా..

పోస్టు	సంఖ్య
డీసీపీ	01
సీఐ	02
ఎస్సై	24
ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుళ్లు	245
కానిస్టేబుళ్లు	352
హోంగార్డులు	70



శనివారం రాత్రి హనుమకొండ పద్మాక్షిగుట్ట వద్ద వాహనదారులను తనిఖీలు చేస్తున్న మహిళా పోలీసులు

చాలెంజింగ్ విధులు...

రాత్రిపూట విధులు నిర్వహించడం మహిళా పోలీసులకు చాలెంజింగ్ మారింది. బ్లూకోల్ట్ సిబ్బందితో సమానంగా రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు నిర్దేశించిన డ్యూటీని నిర్వహిస్తున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న హాస్టళ్ల పరిసరాలను పరిశీలించడంతోపాటు బార్‌అండ్‌రెస్టారెంట్ల దగ్గర ఎదురయ్యే ఆకతాయిల గొడవలు మొదలు కొని, అనుమానిత వ్యక్తుల వివరాలు సేకరిస్తున్నారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో బ్యాగులు, తదితర వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ చేయడం, రౌడీ షీటర్ల ఇళ్లను సందర్శించి ఉన్నారో, లేదో తెలుసుకోవడం, రాత్రి పూట నిర్వహించే వ్యాపారాలను బంద్ చేసి ఎక్కడా చిన్న ఘటన జరగకుండా చూసుకోవడం చేస్తున్నారు. దీంతోపాటు ఏదైనా లాఅండ్‌ఆర్డర్‌కు సంబంధించి పెద్ద సంఘటన జరిగితే వెంటనే బ్లూకోల్ట్ సిబ్బంది సహకారం తీసుకుని పరిష్కరిస్తున్నారు.



శనివారం రాత్రి హనుమకొండ బస్టాండ్ సమీపంలో ఓ వ్యక్తి వివరాలు ఆరా తీస్తున్న మహిళా పోలీసులు

హుషారుగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో..

మహిళా పోలీస్ అధికారులు అత్యంత హుషారుగా ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను వేతనంతో పాటు 30 శాతం అదనంగా చెల్లిస్తారు. దీనికి తోడు ఉన్నత అధికారుల నుంచి విధులకు సంబంధించి ఎలాంటి ఒత్తిళ్లు లేకపోవడంతో ట్రాఫిక్ విధుల్లో మక్కువ చూపిస్తున్నారు. ప్రస్తుతం ట్రైసిటీ పరిధి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో ఒక ఇన్‌స్పెక్టర్, ముగ్గురు ఏఎస్సైలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, ఏడుగురు కానిస్టేబుళ్లు, ఒకరు హోంగార్డు విధుల్లో కొనసాగుతున్నారు.

అనుమానం వస్తే తనిఖీ చేస్తున్నాం..



అర్ధరాత్రి యువత బర్త్‌డేలు చేసుకొని రోడ్లపై అరవడం, డ్యాన్సులు చేస్తున్నారు. వీరిని వారిస్తే వాగ్వాదానికి దిగుతున్నారు. బస్టాండ్, చౌరస్తా వంటి ప్రాంతాల్లో మాకు ఏమాత్రం అనుమానం వచ్చిన వారి ఫింగర్ ప్రింట్ తీసుకుని పాత నేరస్తులు అయితే ప్రశ్నించి ఆ సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. రాత్రి పూట విధులు కొంత కష్టమైనప్పటికీ పోలీస్‌శాఖలోకి వచ్చినం కాబట్టి సంతోషంగా నిర్వహిస్తున్నాం.

- ఎం.వినూష, కానిస్టేబుల్

క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నాం..



పోలీస్‌శాఖలో 30 ఏళ్లుగా పనిచేస్తున్నా. రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించడం, అనుమానితులను చెక్ చేయడం వంటివి చేస్తున్నా. నూతనంగా పోలీస్ శాఖలో వచ్చిన మహిళా కానిస్టేబుళ్లకు రాత్రిపూట ధైర్యంగా విధులు ఏవిధంగా నిర్వహించాలో క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నా. వారు ఎంతో బాగా నేర్చుకుంటున్నారు.

- తాండ్ర కమల ఏఎస్సై, హనుమకొండ

ఆర్మీకి దీటుగా విధులు..



పోలీస్ శాఖలో అందరూ సమానమే అనేలా పురుషులతో సమానంగా మహిళా అధికారులతో విధులు చేయిస్తున్నాం. ఆర్మీలో పురుషులతో సమానంగా అన్ని రకాల విధులు మహిళా అధికారులు చేస్తున్నారు. అదే స్ఫూర్తితో ఇక్కడ డ్యూటీలు వేస్తున్నాం. ఏ డ్యూటీ వేసిన వారు చక్కగా రాణిస్తున్నారు. గతంలో కూడా అన్ని రకాల డ్యూటీలను మహిళా అధికారులు చేశారు. ప్రస్తుతం మరోసారి వారు అన్ని రకాల విధుల్లో రాణిస్తున్నారు.

- సన్‌ప్రీత్ సింగ్, పోలీస్ కమిషనర్, వరంగల్

విద్యార్థుల మేధస్సును వెలికితీయాలి

● కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



వంట గదిలో పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థుల మేధస్సును వెలికితీయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం బీ ఫార్మసీ బాలికల గురుకుల కళాశాలను శనివారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నూతన టెక్నాలజీతో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలన్నారు. అంకితభావంతో పనిచేస్తూ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన మెనూను ప్రకారం రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. వసతి గృహాల్లో వార్డెన్ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యంలో విద్యార్థులకు వేడి ఆహారాన్నే అందించాలని చెప్పారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలను సందర్శించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ తరగతులను నిర్వహిస్తు విద్యార్థులను సైన్స్ టెక్నాలజీతోపాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని, తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

యూరియా వినియోగం తగ్గించాలి

● ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు

మహబూబాబాద్ రూరల్: యూరియా వినియోగాన్ని తగ్గించాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు అజ్మీరా శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద యూరియా కోసం వచ్చిన రైతులను ఉద్దేశించి శ్రీనివాసరావు శనివారం మాట్లాడారు. యూరియాను అధిక మొత్తంలో వినియోగించి అనారోగ్యాల పాలుకావద్దన్నారు. జిల్లాకు ఇప్పటి వరకు 21,071.452. మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన తెలిపారు. ఇఫ్కో కంపెనీ నుంచి ప్రభుత్వం 112 మెట్రిక టన్నుల యూరియా కేటాయించారని, ప్రైవేట్ డీలర్లకు 88 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు తెలిపారు. ఆదివారం ఆర్.సీ.ఎఫ్ కంపెనీ నుంచి 112 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్లకు 88 మెట్రిక్ టన్నులు కేటాయింపు చేస్తారని తెలిపారు. 500 ఎం.ఎల్ నానో యూరియా 50 కిలోల యూరియా బస్తాకు సమానమని వివరించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ పురుషోత్తం, డీసీఓ వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, ఏఓ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ చంద్రరాజేశ్వర్ రావు, టౌన్ సీఐ మహేందర్ రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ ప్రమోద్ పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, చిత్రంలో మంత్రి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు, యశస్వినిరెడ్డి, ఠాకూర్, ఎమ్మెల్సీ సారయ్య, ఎంపీలు కావ్య, బలరాంనాయక్ తదితరులు



స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం మనదే

● రాష్ట్ర మంత్రులు లక్ష్మణ్, సీతక్క ● జనహిత పాదయాత్రపై సమీక్ష

ఈ నెల 25, 26 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టనున్న జనహిత పాదయాత్ర విజయవంతానికి శనివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రులు లక్ష్మణ్, సీతక్క హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం విజయం సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు.

- హన్మకొండ చౌరస్తా - వివరాలు 8లో▸

విద్యాశాఖలో పదోన్నతుల పండుగ

● జిల్లాలో 103 మంది ఎస్జీటీలకు పదోన్నతి
● కసరత్తు చేస్తున్న విద్యాశాఖ అధికారులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న పదోన్నతులకు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ పడింది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్జీటీలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో 103 మంది స్కూల్ అసిస్టెంట్లుగా, వివిధ సబ్జెక్టుల్లో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి పొందనున్నారు. ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులు రిపోర్ట్ చేస్తే మిగతావాటిని భర్తీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 103 మంది ఎస్జీటీల సీనియార్టీ ఆధారంగా ఖాళీల జాబితాను అధికారులు విడుదల చేశారు. నేడు (ఆదివారం) వెబ్‌సైట్‌లో పాఠశాలలను ఎంపిక చేసుకునే అవకాశం ఉపాధ్యాయులకు కల్పించారు.



ఉపాధ్యాయుల పదోన్నతులపై కసరత్తు చేస్తున్న విద్యాశాఖ అధికారులు

పదోన్నతుల కేటాయింపు ఇలా..

ఎస్జీటీ ఉపాధ్యాయుల నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు పొందే వారు సీనియార్టీ ఆధారంగా జిల్లా వ్యాప్తంగా 103 మంది ఉన్నారు. 14 మంది స్కూల్ అసిస్టెంట్లు జిల్లాలో ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు పొందారు.

ఉపాధ్యాయుల జాబితాను తయారు చేస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్జీటీల ఉపాధ్యాయుల లిస్టు, సీనియార్టీ ప్రకారం వారికి వివిధ సబ్జెక్టుల వారీగా పదోన్నతులు కల్పిస్తాం. ప్రభుత్వ నింబధనలు మేరకు షెడ్యూల్ వచ్చాక పదోన్నతులు ప్రారంభిస్తాం. ఉపాధ్యాయులు పదోన్నతుల విషయంలో ఆందోళనలు చెందవద్దు.

- డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈఓ

మతసామరస్యాన్ని పెంపొందించుకోవాలి

● డీఎస్పీ తిరుపతిరావు



మాట్లాడుతున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్: వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ సమీపిస్తున్న తరుణంలో మత సామరస్యాన్ని పెంపొందించుకునేందుకు పీస్ కమిటీ సభ్యులు కృషి చేయాలని డీఎస్పీ తిరుపతిరావు కోరారు. జిల్లా శాంతి, సంక్షేమ కమిటీ (పీస్ కమిటీ) సభ్యులతో మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు సజావుగా పండుగలు నిర్వహించుకోవడానికి తీసుకునే చర్యలపై చర్చించారు. పోలీసులకు ప్రజలు సహకారం అందించాలని, మత సామరస్యాన్ని బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి, ఎస్సైలు శివ, అశోక్, అలీం హుస్సేన్, సూరయ్య, మౌనిక పాల్గొన్నారు.

బోదకాలు వ్యాప్తిని అరికట్టాలి



మాట్లాడుతున్న డాక్టర్ శిరీష

కొత్తగూడ: బోదకాలు వ్యాప్తిని అరికట్టేందుకు గ్రామస్తులు సహకరించాలని డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డాక్టర్ శిరీష కోరారు. మండలంలోని వేలుబెల్లిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బోదకాలు దోమ కాటు వల్ల వస్తుందన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన మందులు ప్రతీ ఒక్కరు వేసుకోవాలని సూచించారు. మందుల వాడకం వల్ల ఎలాంటి దుష్ప్రభావం ఉండదని, వ్యాధి కారక క్రిములు ఉన్న వ్యక్తుల్లో కొద్దిపాటి ఇబ్బందులు ఏర్పడతాయని అవగాహన కల్పించారు. వాటి వల్ల ఎలాంటి ఇబ్బందులు రావన్నారు. మాజీ సర్పంచ్ వజ్జ వెంకటలక్ష్మి, గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రత్యూష, సుధీర్‌రెడ్డి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్ర సేవలు అభినందనీయం

● ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్: ఆరోగ్యవంతమైన సమ సమాజ స్థాపనకు మిత్రుల సంఘటితంతో స్థాపించిన ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ రజతోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను శనివారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 2000 సంవత్సరం నుంచి అనేక అంశాలపై కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్, సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సహజ పాల్గొన్నారు.


ప్రమాదాల నివారణకు చర్యలు

● విద్యుత్‌శాఖ ఎస్ఈ విజేందర్‌రెడ్డి

నెహ్రూసెంటర్: విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజేందర్‌రెడ్డి శనివా రం ఒక ప్రకటనలో తెలిపారు. జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డీఈ టెక్నికల్ అధికారులను సేఫ్టీ అధికారులుగా నియమిస్తూ విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. పొలంబాట చేపట్టి 4,149 లూజ్‌లైన్లు, 2,265 వంగిన పోల్స్, 5,625 మధ్య స్తంభాలు ఏర్పాటు చేయగా 873 లో లెవల్ క్రాసింగ్, 592 డబుల్ ఫీడింగ్ పాయింట్లు మార్చినట్లు, 1,014 డీటీఆర్‌లను ఎత్తు పెంచినట్లు ఎస్ఈ తెలిపారు. విద్యుత్‌సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ 1912లో సంప్రదించవచ్చని తెలిపారు.

మైనర్లపై అఘాయిత్యం నేరం

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ



మాట్లాడుతున్న జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ

మహబూబాబాద్ రూరల్: లైంగిక అఘాయిత్యం మైనర్ బాలుడిపై జరిగినా పోక్సో చట్టం పరిధిలోకి వస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. జిల్లాలో పోక్సో కేసుల నమోదు, విచారణ తదితర అంశాలపై జిల్లాస్థాయి అధికారుల సమావేశం న్యాయ సేవ సదన్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ మాట్లాడుతూ.. సాధారణంగా మైనర్ బాలికలపై లైంగిక అఘాయిత్యం జరిగితేనే పోక్సో చట్టం వర్తిస్తుందని అపోహ సమాజంలో ఉందని, కానీ 18 సంవత్సరాలలోపు వయసున్న బాలబాలికలపై జరిగిన లైంగిక నేరాలన్నీ పోక్సో చట్టపరిధిలోకే వస్తాయని స్పష్టం చేశారు. పిల్లలకు సంబంధించి ప్రభుత్వం ఏ చట్టం చేసినా బాలలు మంచి వాతావరణంలో పెరగాలన్నదే ఆ చట్టాల ఉద్దేశమని తెలిపారు. బాలలపై లైంగిక నేరం జరిగినట్లు తెలిసినప్పటికీ పోలీసులకు ఫిర్యాదు చేయయనివారుకూడా ఈ చట్ట ప్రకారం శిక్షార్హులేనని వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఎస్.శాలిని మాట్లాడుతూ.. పోక్సో చట్టం బాల్యవివాహాల నిరోధక చట్టాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో కూడా వివిధ రకాల చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన లఘు చిత్రాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపెల్లి వెంకటయ్య, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి, సభ్యులు డేనియల్, అశోక్, జిల్లా బాలల సంరక్షణ అధికారి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలకు నోడల్ అధికారి నియామకం



డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్

గార్ల: జిల్లాలోని 9 పీహెచ్‌సీలకు ప్రభుత్వ నోడల్ అధికారిగా గంధంపల్లి పీహెచ్‌సీ డాక్టర్ రాజ్‌కుమార్‌ను నియమిస్తూ శనివారం డీఎంహెచ్‌ఓ రవి రాథోడ్ ఉత్వర్వులు జారీచేశారు. జిల్లాలోని బయ్యారం, గార్ల, గంగారం, కొత్తగూడ, అయోధ్యపురం, గంధంపల్లి, కోమట్లగూడెం, తీగలవేణి, ముల్కనూరు పీహెచ్‌సీల పరిధిలో నిర్వహించే జాతీయ ఆరోగ్య మిషన్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాల అమలు తీరుతెన్నులను రాజ్‌కుమార్ పరిశీలించనున్నారు. విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక నోడల్ అధికారి అవగాహన చర్యలు చేపట్టనున్నారు.

క్లుప్తంగా

యూరియా వచ్చేసింది..

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేస్టేషన్ గూడ్స్ షెడ్‌కు శనివారం ఇఫ్కో కంపెనీకి చెందిన 1,340.010 మెట్రిక్ టన్నుల యూరియా చేరింది. ఇఫ్కో కంపెనీ ప్రతినిధులతో కలిసి వ్యవసాయ అధికారులు రవీందర్‌రెడ్డి, విజ్ఞాన్ వ్యాగన్‌లోని యూరియాను పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యూరియాను ఉమ్మడి జిల్లా పరిధిలోని ఫర్టిలైజర్ షాపులకు 40 శాతం, మార్క్‌ఫెడ్‌కు 60 శాతం పంపిస్తామని వారు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


శ్రీలేఖ మృతదేహం

కాజీపేట : దర్గా కాజీపేటకు చెందిన చాడ శ్రీలేఖ (30) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా పోలీసులు కేసు నమోదు చేశారు. కాజీపేటకు చెందిన శ్రీలేఖకు దర్గా ప్రాంతానికి చెందిన చాడ శ్రావణ్‌కుమార్‌తో 2014లో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెళ్లయిన కొద్దికాలం అన్యోన్యంగా ఉన్నారు. అనంతరం మనస్పర్థలతో ఘర్షణ పడుతున్నారు. ఈ క్రమంలో శనివారం శ్రీలేఖ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందనే సమాచారం మేరకు కుటుంబ సభ్యులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. తమ కూతురు మృతిపై అనుమానాలు ఉన్నాయనే తల్లి చింతకింది లలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కడవెండిలో సురవరం జ్ఞాపకం..


కొమురయ్య స్మారక భవన ప్రారంభంలో సురవరం సుధాకర్‌రెడ్డి (ఫైల్)

దేవరుప్పుల : మండలంలోని కడవెండిలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి యోధుడు దొడ్డి కొమురయ్య స్మారక భవన నిర్మాణంలో సీపీఐ పక్షాన కీలక పాత్ర పోషించిన ఆ పార్టీ జాతీయ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి భాగస్వామ్యం జ్ఞాపకం పదిలంగా ఉంది. నిర్బంధ కాలంలో దొడ్డి కొమురయ్య భవన్ ఏర్పాటు సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో నక్సల్స్ అనుబంధ పార్టీల సహకారంతో స్థల సేకరణకు శ్రీకారం చుట్టగా సీపీఐ భవన నిర్మాణంలో కీలక పాత్ర పోషించి సుధాకర్ రెడ్డి ప్రారంభోత్సవానికి వచ్చారు. ఈ తరుణంలో డీకే ఫౌండేషన్ ప్రతినిధులు సురవరాన్ని కలిసి ఫొటో దిగారు. ఇది చిరస్మరణీయమని ఫౌండేషన్ ప్రతినిధి అస్నాల శ్రీనివాస్ పేర్కొన్నారు.

ప్రకృతి సోయగం.. భీమునిపాదం..

Sunday Special

ఎత్తైన గుట్టల నడుమ నుంచి జాలువారుతున్న జలపాతం


జలపాతం వద్ద పర్యాటకుల సందడి


జలపాతం వద్ద పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన పగోడ


జలపాతం వద్ద మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ఏర్పాటు చేసిన గదులు

- మనసును కట్టి పడేస్తున్న ఆహ్లాదకర వాతావరణం
- ఆస్వాదిస్తున్న పర్యాటకులు.. టూరిజం కేంద్రంగా ఏర్పాట్లు
- ఎకో డెవలప్‌మెంట్ కమిటీతో నిర్వహణ

గూడూరు: అదో అందమైన జలపాతం. ప్రకృతి రమణీయతను సంతరించుకున్న పచ్చని అటవీ ప్రాంతం. చుట్టూ గుట్టలు.. పక్షుల కిలకిల రావాలు.. గలగల పారే సెలయేటి సవ్వళ్లు.. గుట్టల నడుమ నుంచి సుమారు 70 అడుగుల ఎత్తు నుంచి దూకే జలధార. అదే పర్యాటకులను ఉల్లాసపరుస్తూ.. వారి మనసును కట్టిపడేస్తున్న భీమునిపాదం జలపాతం. పాండవులు వనవాస సమయంలో ఈ ప్రాంతంలో గడిపినట్లు, ఈ జలపాతం పై భాగంలో భీముని పాదముద్ర ఉండడంతో భీమునిపాదం జలపాతంగా పేరుగాంచిందని స్థానికుల నమ్మకం. ప్రకృతి అందాల నడుమ పాలసురగల్లా జాలువారే ఈ జలపాతం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ముల వంచ సమీప అటవీ ప్రాంతంలో ఉంది.

జలపాతం పక్కనే దేవుళ్ల విగ్రహాలు..

భీమునిపాదం జలపాతం పక్కనే శివుడు, పాపాయమ్మ, నాగదేవతల విగ్రహాలు ఉన్నాయి. జలపాతం నుంచి జాలువారిన నీరు సమీప భీమునిపాద చెరువులోకి చేరుతుంది. ఈ చెరువు నీటితోనే కొమ్ములవంచలో పంటలు పండుతాయి. ప్రతీ సంవత్సరం కొమ్ములవంచ గ్రామస్తులు మృగశిరకార్తె ప్రవేశించిన మొదటి బుధవారం అక్కడ ఉన్న దేవతల విగ్రహాలకు పూజలు చేస్తారు. అలాగే, మహా శివరాత్రి, కార్తీక పౌర్ణమి పర్వదినాల్లో ఇక్కడి విగ్రహాలకు పూజలు చేస్తారు. పర్యాటకులు కూడా జలపాతం కింద స్నానమాచరించి దేవతామూర్తుల విగ్రహాలకు మొక్కుకోవడం ఆనవాయితీ.


భీమునిపాద జలపాతం ద్వారం

జలపాత సందర్శనకు దారి ఇలా..

భీమునిపాదం జలపాతం వరంగల్‌కు 55 కిలోమీటర్ల దూరంలో ఉంది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి 9 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడికి చేరుకోవడానికి మూడు మార్గాలున్నాయి. ఒక మార్గం నర్సంపేట నుంచి భూపతిపేట బస్టాండ్, సీతానగరం శివారు కొమ్ములవంచ మీదుగా, మరో మార్గం గూడూరు, చంద్రుగూడెం, లైన్‌తండా, వంపుతండాల మీదుగా, ఇంకో మార్గం ములుగు జిల్లా కొత్తగూడ మండల కేంద్రం, కోలారం, బత్తులపల్లి, గోపాలపురం మీదుగా భీమునిపాదం జలపాతం చేరుకోవచ్చు. దట్టమైన అటవీ ప్రాంతం ఉన్న ఈ జలపాతం రెండు దశాబ్దాలుగా పర్యాటక కేంద్రంగా పేరుగాంచింది. పర్యాటకుల రద్దీ పెరుగుతున్న క్రమంలో అక్కడ మౌలిక సదుపాయాల ఏర్పాటుపై అటవీశాఖ దృష్టి సారించింది.

రూ. 54 లక్షలతో అభివృద్ధి పనులు..

రిజర్వ్ ఫారెస్ట్, వన్యప్రాణి విభాగం పరిధిలోని ఈ జలపాతం సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అటవీ శాఖ పలు చర్యలు చేపట్టింది. రూ. 54 లక్షలతో జలపాతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. స్వాగత ద్వారం, పార్కు, స్విమ్మింగ్ పూల్, జలపాతం పైభాగంలో కూడా వాచ్ టవర్, కుర్చీలు, బెంచీలు, మంచినీరు, బాత్‌రూమ్‌ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.

ఎకో డెవలప్‌మెంట్ కమిటీ ద్వారా నిర్వహణ..

భీమునిపాద జలపాతం అభివృద్ధికి శ్రీకారం చుట్టిన అటవీశాఖ.. ఎకో డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగించింది. ఈ కమిటీలో అదే గ్రామానికి చెందిన వ్యక్తులను చైర్మన్, వైస్‌చైర్మన్‌గా, బీట్ అధికారిని పర్యవేక్షకుడిగా నియమించారు. పర్యాటకుల నుంచి రుసుం రూపేణ వసూలు చేసే మొత్తాన్ని నిర్వహణ ఖర్చుల కోసం ఉపయోగిస్తున్నారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలం ప్రారంభంతో నాలుగు నెలల పాటు జలపాత వీక్షణకు సందర్శకుల తాకిడి ఎక్కువ ఉంటుంది. ప్రతీ ఒక్కరి నుంచి రూ. 40 చొప్పున రుసుము వసూలు చేస్తున్నారు. అదే విధంగా బైక్, ఆటో, ఫోర్, సిక్స్ వీలర్ వాహనాలకు టోకెన్ వసూలు చేస్తున్నారు. అయితే రెండు దశాబ్దాలుగా పర్యాటక కేంద్రంగా పేరుగాంచినా జాతీయ రహదారి నుంచి ఇక్కడకు చేరుకోవడానికి రోడ్డు మాత్రం ఇబ్బందికరంగా ఉంది. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి జలపాతం వరకు బీటీ రోడ్డు వేయించాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

‘స్థానికం’లో విజయం మనదే..



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్, సమీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్
- జనహిత పాదయాత్రపై సమీక్ష

హన్మకొండ చౌరస్తా: త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం విజయం సాధించి తీరుతామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 25, 26 తేదీల్లో జిల్లాలో చేపట్టనున్న ‘జనహిత పాదయాత్ర’పై శనివారం హనుమకొండలోని డీసీసీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి మంత్రులు లక్ష్మణ్, సీతక్క ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ చేపట్టిన జనహిత పాదయాత్ర ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు రోజులు కొనసాగుతుందన్నారు. మొదటి రోజు వర్ధన్నపేట మండలం ఇల్లంద మార్కెట్ నుంచి వర్ధన్నపేటలోని అంబేడ్కర్ సెంటర్ వరకు, రెండో రోజు వర్ధన్నపేట నుంచి ఫిరంగిగడ్డ ప్రభుత్వ పాఠశాల వరకు కొనసాగుతుందన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ పాదయాత్ర ద్వారా ప్రజాప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ఫలాలను అందరికీ వివరించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. అభివృద్ధితో పాటు పార్టీ బలోపేతానికి మరింత చురుగ్గా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ఠాకూర్, కేఆర్ నాగరాజు, యశస్వినిరెడ్డి, ఎంపీలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ బాధ్యులు సత్యనారాయణ, ఈవీ శ్రీనివాస్, ధర్మారావు, ప్రభాకర్‌రెడ్డి, బత్తిని శ్రీనివాసరావు, మేయర్ గుండు సుధారాణి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డికి శ్రద్ధాంజలి ఘటించారు.

మీతో కలిసి పనిచేస్తా..

సమీక్ష సమావేశానికి హాజరుకానీ మంత్రి కొండా సురేఖ.. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి లక్ష్మణ్‌కు ఫోన్ చేశారు. అనివార్య కారణాలతో తాను సమావేశానికి హాజరు కాలేకపోతున్నానని, ఉమ్మడి జిల్లాలో నిర్వహించే ప్రతీ కార్యక్రమానికి మీతో కలిసి పనిచేస్తామని తెలిపారు.

వ్యక్తిగత కారణాలతో హాజరుకాని ఎమ్మెల్యేలు..

వ్యక్తిగత కారణాలతో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమీక్షకు హాజరు కాలేకపోతున్నట్లు సమాచారం చేరవేశారు. కాగా, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, మురళీనాయక్, డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్ గైర్హాజరయ్యారు.

ఆటోమేటిక్ మీటరు రీడింగ్‌తో బిల్లింగ్ సులువు

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: హెచ్‌టీ సర్వీస్‌ల బిల్లింగ్‌లో లోపాలు సవరించడానికి ఆటోమేటిక్ మీటరు రీడింగ్ ప్రక్రియ ప్రారంభించామని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. ఈ విధానాన్ని డిసెంబర్ నాటికి అన్ని సర్కిళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. శనివారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎండీ మాట్లాడుతూ ప్రస్తుతం కరీంనగర్, వరంగల్, హనుమకొండలో పనులు జరుగుతున్నాయన్నారు. మోడెం ద్వారా కచ్చితమైన సమాచారం వస్తుందన్నారు. మీటరు స్థితి, విద్యుత్ వినియోగం, సరఫరా సమాచారం రియల్ టైంలో వస్తుందని తెలిపారు. ఇలా చేయడం వల్ల పొరపాట్లకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. నవరాత్రి ఉత్సవ నిర్వాహకులు, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు, ఎన్పీడీసీఎల్ సిబ్బందికి సూచనలు తెలిపే కరపత్రం రూపొందించామని, దీనిని 16 సర్కిళ్ల పరిధిలో మండపాల నిర్వాహకులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, సీఈలు అశోక్ కుమార్, సదర్ లాల్, తిరుమల్ రావు, అశోక్, వెంకట రమణ, చరణ్ దాస్, జీఎంలు అన్నపూర్ణ, సురేందర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు రెండు సీఓఈ కళాశాలలు

- ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఈనెల 29వ తేదీ వరకు గడువు

న్యూశాయంపేట : ఉమ్మడి వరంగల్ జిల్లాకు తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థలు(టెమ్రిస్) ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాలలు రెండు మంజూరయ్యాయి. ఈ మేరకు టెమ్రిస్ సెక్రటరీ షఫియుల్లా ఉత్తర్వులు జారీచేశారు. సీఓఈ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టెమ్రిస్ ఉమ్మడి జిల్లా కో–ఆరినేటర్ జంగా సతీశ్ శనివారం తెలిపారు. ఉమ్మడి జిల్లా మైనారిటీ కేటగిరీకి చెందిన (ముస్లింలు, క్రిస్టియన్లు, పార్సీలు, జైనులు, సిక్కులు)వారితోపాటు నాన్ మైనారిటీ కోటా కింద (ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఓసీ) అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అర్హులన్నారు. బాలికల కోసం ఒకటి(వరంగల్(జీ1) కేయూ క్రాస్), బాలుర కోసం ఒకటి (వరంగల్(బీ1) రంగశాయిపేట జక్కలొద్దిలో సీఓఈలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. దరఖాస్తులు సమర్పించడానికి ఈనెల 29 వరకు గడువు ఉందన్నారు. మరిన్ని వివరాలకు ములుగురోడ్డు పెద్దమ్మగడ్డ సమీపంలోని మైనారిటీ గురుకులాల ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రాంతీయ సమన్వయాధికారి కార్యాలయం లేదా 7331170866, 7331107367 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఏసీబీ వలలో డోర్నకల్ సీఐ, కానిస్టేబుల్

- బెల్లం కేసులో రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు
- సీఐ ఇంట్లో మరో రూ.1.25 లక్షల నగదు స్వాధీనం


ఏసీబీకి పట్టుబడిన సీఐ రాజేష్, కానిస్టేబుల్ రవి

డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ సీఐ బి.రాజేష్ బెల్లం కేసులో నిందితుడినుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా శనివారం ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సీఐతోపాటు గన్‌మెన్ (కానిస్టేబుల్) రవిని అదుపులోకి తీసుకుని వరంగల్ ఏసీబీ కోర్టుకు తరలించారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి కిరాణంతోపాటు బెల్లం వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గత మే నెలతోపాటు ఈ నెల మొదటి వారంలో సదరు వ్యాపారి బెల్లం తరలిస్తుండగా డోర్నకల్ పోలీసులు పట్టుకుని బొలేరోతోపాటు ట్రాలీ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేశారు. మొదటి కేసుకు సంబంధించి సీఐ.. నిందితుడికి నోటీసు జారీ చేయలేదు. ఈ నెల మొదటి వారంలో నమోదైన కేసులో నిందితుడు హైకోర్టునుంచి ముందస్తు బెయిల్ పొందాడు. సీఐ ఆదేశాల మేరకు గన్‌మెన్ రవి సదరు వ్యాపారికి ఫోన్ చేసి సీఐ రమ్మంటున్నాడని, రూ.50 వేల లంచం ఇవ్వాలని, లేకుంటే బెల్లం వ్యాపారం చేయనివ్వమని బెదిరించాడు. దీంతో సదరు వ్యాపారి ఈ నెల 21న ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో సీఐపై నిఘా పెట్టిన ఏసీబీ అధికారులు శనివారం స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలోని సీఐ ఇంటికి వెళ్లిన వ్యాపారి రూ.30 వేల నగదు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్ పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. అనంతరం ఇంట్లో తనిఖీలు నిర్వహించి రూ.1,25,050 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. సీఐతో పాటు గన్‌మెన్ రవిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు చెప్పారు. కేసు విచారణలో భాగంగా ఫిర్యాదుదారుడి పేరు గోప్యంగా ఉంచుతున్నట్లు తెలిపారు. దాడుల్లో డీఎస్పీతో పాటు సీఐలు ఎల్.రాజు, ఎస్. రాజు, ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు కులమతాలకతీతంగా జీవించాలి

- రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్
- ముగిసిన కాజీపేట దర్గా ఉత్సవాలు
- పాల్గొన్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సారయ్య


మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్


పొట్టలో ఇనుప చువ్వలు దించుకుంటున్న ఫకీర్

కాజీపేట రూరల్ : ప్రజలు కులమతాలకతీతంగా కలిసి ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కాజీపేట దర్గా ఉత్సవాలు ముగింపునకు మంత్రి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకాగా నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి ఫకీర్ల విన్యాసాలు తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చారిత్రక కాజీపేట దర్గా దీవెనలతో తెలంగాణ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రసిద్ధిగాంచిన కాజీపేట దర్గా ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుగుతాయన్నారు. అనంతరం దర్గా పీఠాధిపతి, తెలంగాణ రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా మాట్లాడుతూ దేశ నలుమూలల నుంచి పీఠాధిపతులు, కులమతాలకతీతంగా భక్తులు తరలొచ్చి దర్గాను దర్శించుకుని అల్లా దీవెనలు పొందారన్నారు.

ఆకట్టుకున్న ఫకీర్ల విన్యాసాలు..

కాజీపేట దర్గా ముగింపు ఉత్సవంలో ఫకీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్, పూణె నుంచి వచ్చిన ఫకీర్లు విన్యాసాలు చేపట్టారు. కార్యక్రమంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన దర్గా పీఠాధిపతి అబ్దుల్ రజాక్ బాబామలంగ్ మసుమస్ మదారి, మన్సూర్ బియాబానీ, ముస్లిం మతపెద్దలు, వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇవి.శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ నాయకుడు ఆనంద్ మోసస్, ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ కార్పొరేటర్ అబుబాకర్, సింగారపు రవిప్రసాద్, కందుకూరి పూర్ణచందర్, అరూరి సాంబయ్య, ఎం.డి. ఇంతియాజ్, లెంకలపల్లి శ్రీనివాస్, పోతరబోయిన శ్రీనివాస్, ఎస్.కె.సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు సమాయత్తం కావాలి


మాట్లాడుతున్న కరీంనగర్ జోన్ ఈడీ సోలమన్

- ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సోలమన్

హన్మకొండ: మేడారం జాతరకు ఆర్టీసీ అధికారులు సమాయత్తం కావాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ పి.సోలమన్ సూచించారు. శనివారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో కరీంనగర్ జోన్‌లోని రీజినల్ మేనేజర్ల సమావేశం నిర్వహించారు. ఇందులో 2026 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరగనున్న మేడారం జాతరపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ 2024 మేడారం జాతరలో ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగిందన్నారు. దీనికి కారణం సొంత వాహనాలు విరివిగా రావడమేనని, ప్రైవేట్ వాహనాల నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ట్రాఫిక్ జామ్ అయ్యి మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని గుర్తు చేశారు. మేడారం భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని, దీనిపై అధికారులు విస్తృత ప్రచారం చేయాలన్నారు. భక్తుల సంఖ్యకనుగుణంగా బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం ఆర్ఎంలు డి.విజయభాను, బి.రాజు, భవానీ ప్రసాద్, ఎ.సరిరాం, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు భాను కిరణ్, శ్రీ మహేశ్, భూపతిరెడ్డి, మధుసూదన్, ఈఈ బీఆర్ సింగ్, అకౌంట్స్ ఆఫీసర్ ఎ. రవీందర్, డిపో మేనేజర్లు ధరమ్ సింగ్, రవిచంద్ర, అర్పిత, శివకుమార్, శ్రీరాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్, పక్కన కలెక్టర్లు స్నేహశబరీష్, సత్యశారద, రిజ్వాన్ బాషా

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్
- మూడుజిల్లాల కలెక్టర్లు, జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌తో సమన్వయ సమావేశం


హాజరైన వివిధ శాఖల అధికారులు

కేయూ క్యాంపస్: గణేశ్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. శనివారం కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం సెనేట్‌హాల్‌లో కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు, జీడబ్ల్యూఎంసీ కమిషనర్, గణేశ్ ఉత్సవ కమిటీ, హిందూ ధర్మ పరిషత్, ముస్లిం మత పెద్దలతో నిర్వహించిన సమావేశంలో సీపీ మాట్లాడారు. గణేశ్ ఉత్సవాలు పోటీ తత్వంతో కాకుండా భక్తిభావంతో నిర్వహించాలని తెలిపారు. మండపాలకు విద్యుత్‌శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. గణేశ్ నిమజ్జనం, మిలాద్ – ఉన్ –నబీ ఒకేరోజు వస్తున్నాయని, ఈ నేపథ్యంలో మతసామరస్యం దెబ్బతినకుండా ఒకరికొకరు సహకరించుకోవాలని కోరారు. హనుమకొండ కలెక్టర్ స్నేహశబరీష్ మాట్లాడుతూ జిల్లాపరిధిలో 12 నిమజ్జనం ప్రదేశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వరంగల్ కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలో 35 వరకు చెరువులు ఉన్నాయని, అక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగుండా నిమజ్జనానికి చర్యలు చేపడుతామన్నారు. వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ మాట్లాడుతూ నిమజ్జనం ప్రదేశాల్లో వివిధ పనులను చేపట్టేందుకు రూ. 18లక్షలు కేటాయించామన్నారు. మున్సిపల్ పరిధిలోని చిన్న వడ్డేపల్లి, పద్మాక్షి టెంపుల్, వరంగల్ జిల్లా పరిధిలో 15, హనుమకొండ జిల్లా పరిధిలో 12 నిమజ్జన ప్రదేశాల్లో వివిధ పనులు చేపట్టనున్నామన్నారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల అదనపు కలెక్టర్లు, డీసీపీలు, ఏసీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.